సాక్షి
వరంగల్
శుక్రవారం । 2 । ఆగస్టు । 2024



ర్యాగింగ్‌ను తరిమేద్దాం

ర్యాగింగ్ వికృత క్రీడ అక్కడక్కడా గుట్టుచప్పుడు కాకుండా సాగుతోంది. ఇటీవల జనగామ జిల్లాలో ఓ గురుకుల పాఠశాలలో ర్యాగింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. - 8లో



పలు రైళ్ల రద్దు.. దారి మళ్లింపు

కాజీపేట-విజయవాడ రూట్‌లో జరుగుతున్న మూడో రైల్వే లైన్ పనులతో కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్ల మీదుగా వెళ్లే పలు రైళ్లను అధికారులు రద్దు చేశారు. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
$30^0/24^0$

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తుంది. సాయంత్రం ఆహ్లాదకరంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నల్లబెల్లం, పటిక పట్టివేత

పర్వతగిరి: మండలంలోని అన్నారం షరీఫ్ గ్రామంలో నల్ల బెల్లం, పటికను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై జి.వెంకన్న కథనం ప్రకారం.. గురువారం ఉదయం గ్రామంలో పెట్రోలింగ్ చేస్తుండగా గూడ్స్‌ట్రాలీ వాహనంలో ప్రభుత్వ నిషేధిత గుడుంబా తయారీకి ఉపయోగించే పటిక, నల్లబెల్లాన్ని తరలిస్తూ పోలీసులను చూసి పారిపోతుండగా వెంబడించారు. దీంతో గూడ్స్‌ట్రాలీ వాహనాన్ని అన్నారంషరీఫ్ శివారులో వదిలి ఇద్దరు వ్యక్తులు పారిపోయారని తెలిపారు. గూడ్స్‌ట్రాలీలోని రూ.60,500 విలువ చేసే క్వింటాలు నల్లబెల్లం, 3.5 క్వింటాళ్ల పటికను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

5 నుంచి 'స్వచ్ఛదనం-పచ్చదనం'

కాళోజీ సెంటర్: జిల్లాలో ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. హైదరాబాద్‌లోని బీఆర్ అంబేడ్కర్ సచివాలయం నుంచి గురువారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ సత్య శారదాదేవి పాల్గొని మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఎఫ్‌ఓ అనుజ్ అగర్వాల్, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, డీఎంహెచ్‌ఓ వెంకటరమణ పాల్గొన్నారు.

కాట్రపల్లిని సందర్శించిన ఇటలీ దేశస్తులు

సంగెం: మండలంలోని కాట్రపల్లి గ్రామాన్ని గురువారం ఇటలీ దేశస్తులు సందర్శించారు. బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన చేతి పంపును వారు ప్రారంభించారు. ఇటలీ దేశస్తులు లెటిజఫాంథిని, సెసిల్లా ఫట్టోరే, అమున్యూల్ హెబ్బెమారియం, థెస్ఫాయ్, బాలవికాస ప్రోగ్రాం మేనేజర్ మధుసూదన్ రెడ్డి, గ్రామస్తులు మాధవరెడ్డి, రాజేందర్‌రెడ్డి, ప్రశాంత్ పాల్గొన్నారు.

సీఎం సభకు 2,888 మంది..

విద్యారణ్యపురి: కొన్నేళ్లుగా పదోన్నతుల ప్రక్రియకు నోచుకోని వివిధ కేటగిరీ ఉపాధ్యాయులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల పదోన్నతులు కల్పించిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో.. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా పదోన్నతులు పొందిన సుమారు 30 వేల మంది ఉపాధ్యాయులతో శుక్రవారం హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో సభ నిర్వహిస్తున్నారు. ఈసభకు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి పదోన్నతులు పొందిన 2,888 మంది ఉపాధ్యాయులు తరలివెళ్లనున్నారు. ఈ మేరకు హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, జనగామ జిల్లాల్లో కలెక్టర్ల పర్యవేక్షణలో డీఈఓలు, ఇతర సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉపాధ్యాయులకు ఉదయం బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్నం లంచ్ ఏర్పాట్లు చేశారు.

వరంగల్ రీజియన్ నుంచి 65 ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

హన్మకొండ: సీఎం సభకు ఉపాధ్యాయులను తరలించడానికి వరంగల్ రీజియన్‌లోని 9 డిపోల నుంచి 65 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. హనుమకొండ డిపోనుంచి 8 ప్రత్యేక బస్సులు, పరకాల-2, వరంగల్-2 - 8, వరంగల్-1డి - 7, నర్సంపేట- 5, భూపాలపల్లి - 8,జనగామ-12, తొర్రూరు-5, మహబూబాబాద్ - 10 బస్సులు సమకూర్చారు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి

రాయపర్తి: రోడ్డు ప్రమాదంలో రైతు మృతి చెందిన సంఘటన కిష్టాపురం క్రాస్‌రోడ్డు సమీపంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. మృతుడి బంధువులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మొరిపిరాల గ్రామానికి చెందిన బుర్రి రాజిరెడ్డి (55)కి కిష్టాపురం క్రాస్‌రోడ్డు సమీపంలో వ్యవసాయ భూమి ఉంది. ఆ భూమిలో వేసిన పత్తిలో గుంటుక తోలి సాయంత్రం ఎడ్లను తోలుకొని వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై వస్తున్నాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని వాహనం రాజిరెడ్డిని ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలైన రాజిరెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య, కుమారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుడుంబా విక్రేతలపై కేసు

గీసుకొండ: ఊకల్ క్రాస్‌రోడ్డు వద్ద గుడుంబా విక్రయిస్తున్న ఇద్దరు మహిళలను పోలీసులు గురువారం అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. సీఐ బాబూలాల్ తెలిపిన వివరాల ప్రకారం.. పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా వంచనగిరికి చెందిన కోటమ్మ, హర్జ్యాతండాకు చెదిన హరిత గుడుంబా విక్రయిస్తూ కనిపించారు. వారి నుంచి 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అటకెక్కిన ఆటలు

జిల్లాలో నిరుపయోగంగా క్రీడాప్రాంగణాలు

- పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్న మైదానాలు
- గ్రామాల్లో మూలుగుతున్న స్పోర్ట్స్ కిట్‌లు
- రూ.లక్షలు వెచ్చించినా ప్రయోజనం శూన్యం
- ప్రభుత్వం దృష్టిసారించాలంటున్న క్రీడాకారులు



ఖానాపురం మండలం రంగాపురంలోని క్రీడా ప్రాంగణంలో మేస్తున్న పశువులు

సాక్షి, వరంగల్: క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గ్రామాలు, పట్టణాల్లో రెండేళ్ల క్రితం ప్రారంభించిన తెలంగాణ క్రీడా మైదానాల పరిస్థితి దయనీయంగా మారింది. పట్టించుకునే నాథుడు లేకపోవడంతో గడ్డి మొలిచి, పిచ్చి మొక్కలతో అధ్వానంగా మారాయి. కొన్నిచోట్ల పశువులు సంచరిస్తూ గడ్డి మేస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ కోర్టులతోపాటు లాంగ్‌జంప్ పిట్, వ్యాయామం కోసం సింగిల్, డబుల్ బార్లు ఉండాలి. కానీ, క్షేత్రస్థాయిలో కొన్నిచోట్ల అవి ఎక్కడా కనిపించడం లేదని క్రీడాకారులు వాపోతున్నారు. ఈ ఆట స్థలాల చుట్టూ నీడనిచ్చే మొక్కలు నాటి ఆహ్లాదకరంగా తీర్చిదిద్ది సంరక్షించాల్సిన గ్రామ పంచాయతీలు పట్టించుకోవడం లేదు.

క్రీడాకారులకు అందుబాటులో లేని కిట్‌లు..

జిల్లాలోని 323 గ్రామ పంచాయతీల్లో రెండేళ్ల క్రితం ఈ క్రీడా మైదానాలు ఏర్పాటు చేశారు. ఒక్కో క్రీడా ప్రాంగణానికి రెండు కిట్ల (సంచుల)లో 23 ఆట వస్తువులు, 75 టీషర్ట్‌లను అందజేశారు. మండలానికి ఒక బఫర్ కిట్‌తోపాటు జిల్లాస్థాయిలో అదనంగా మరో 30 నుంచి 40 కిట్లను అందుబాటులో ఉంచారు. క్రికెట్ బ్యాట్, బంతి, రెండు జతల చేతి తొడుగులు, స్టంప్స్ తదితర 12 వస్తువులు, వాలీబాల్ (4), నెట్స్ (2), గాలికొట్టే పంపు, కొలతల టేపు, డంబెల్స్ (మూడు సెట్లు), డిస్కస్ త్రో, టెన్నికాయిట్స్, తాడు ఆటకు తాళ్లు, విజిల్స్, స్టాప్‌ గోవాచ్, అదనపు కిట్ బ్యాగు మొత్తం 23 వస్తువులు ఉన్నాయి. క్రీడాకారులకు ఇవి అందుబాటులో ఉండడం లేదు. అవి పంచాయతీల్లోనే మూలుగుతుండడంతో ఎందుకు పనికి రాకుండా పోతున్నాయనే విమర్శలున్నాయి. కాగా, క్రీడా మైదానాలను సరిగా చదును చేయకపోవడంతో ఆటలు ఆడలేని పరిస్థితి ఉందని క్రీడాకారులు పేర్కొంటున్నారు. ఒలింపిక్స్ నిర్వహిస్తున్న వేళ ఇక్కడి మైదానాలపై చర్చ జరుగుతోంది.

ఎక్కడెక్కడ ఎలా ఉందంటే..

- నర్సంపేట మండలంలోని 27 క్రీడా మైదానాల్లో చాలా చోట్ల బోర్డులు, బార్ స్టాండ్‌లే దర్శనమిస్తున్నాయి. నల్లబెల్లి మండలంలోని 28 క్రీడా మైదానాలు ఉపయోగంలో లేవు. దుగ్గొండి మండలంలోని 17 క్రీడా మైదానాల్లో ఆడుకోవడం లేదు. అరకొర వసతులతో ఖానాపురం మండలంలోని 35 క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. నెక్కొండ మండలంలో 42 క్రీడా మైదానాల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి ఉంది. చెన్నారావుపేట మండలంలోని ఖాదర్‌పేట, కోనాపురం పంచాయతీల్లో మాత్రం సింగిల్ బార్, డబుల్ బార్, వాలీబాల్ కోర్టు, నేమ్ బోర్డులు ఏర్పాటు చేశారు. మిగిలిన 28 గ్రామ పంచాయతీల్లో నేమ్ బోర్డులు పెట్టి వదిలేశారు.
- వర్ధన్నపేట మండలంలోని 18 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఆయా గ్రామాల సామర్థ్యానికి అనుగుణంగా రూ.60 వేల నుంచి రూ.1.5 లక్షల వరకు ఖర్చు చేశారు. ఒకటి రెండు మినహా మిగిలిన వాటిలో సరైన క్రీడా వసతులు, నిర్వహణ లేక అపరిశుభ్రంగా మారాయి. పర్వతగిరి మండలంలోని 57 క్రీడా మైదానాలు, రాయపర్తి మండలంలో 39 క్రీడా మైదానాల్లో బోర్డులు ఉన్నాయి. ఇంకొన్నిచోట్ల పూర్తి స్థాయిలో క్రీడా వసతులు లేవు. సంగెం మండలంలోని 36 క్రీడా ప్రాంగణాల్లో కొన్ని ప్రభుత్వ పాఠశాలలు, మరికొన్ని క్రీడ ప్రాంగణాలను గ్రామాలకు దూరంగా ఏర్పాటు చేశారు. చాలా గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు గడ్డి, పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్నాయి. గీసుకొండ మండలంలోని 21 క్రీడా మైదానాల్లో నిర్వహణ సరిగా లేదు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు గ్రామ పంచాయతీలకు హడావుడిగా పంపిణీ చేసిన క్రీడా సామగ్రి మాజీ సర్పంచ్‌ల ఇళ్లు, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో నిరుపయోగంగా ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు క్రీడామైదానాల నిర్వహణ పట్టించుకోవాలని, కోచ్‌లను నియమించాలని క్రీడాకారులు కోరుతున్నారు.



దుగ్గొండి మండలంలోని గిర్నిబావి క్రీడా ప్రాంగణంలో పిచ్చి మొక్కలు

ఇప్పటికైనా వినియోగంలోకి తేవాలి...



నెక్కొండ మండలంలో 42 క్రీడా మైదానాలు ఉన్నాయి. క్రీడా ప్రాంగణంలో ఆట వస్తువులు, పరికరాలు లేకపోవడంతో మొత్తం పిచ్చి మొక్కలు పెరిగి చిట్టడవిని తలపిస్తున్నాయి. కబడ్డీ, ఖోఖో, క్రికెట్ తదితర క్రీడలకు మైదానాలను ఏర్పాటు చేయాల్సి ఉండగా అధికారులు పట్టించుకోవడం లేదు. క్రీడా ప్రాంగణాల్లో సౌకర్యాలు లేవు. శిక్షకులు లేరు. క్రీడా ప్రాంగణాల పేరుతో నిధులు మాత్రం దుర్వినియోగం అయ్యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి క్రీడా ప్రాంగణాలు వినియోగంలోకి వచ్చేలా శ్రద్ధ చూపాలి.

– మంద కల్యాణ్, క్రీడాకారుడు, గొల్లపల్లి గ్రామం, నెక్కొండ మండలం

తల్లిపాల వారోత్సవాలు ప్రారంభం

- ఈనెల 7వ తేదీ వరకు అవగాహన సదస్సులు
- జక్కలొద్దిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్



జక్కలొద్ది అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు టీచర్ బోధిస్తున్న తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ సత్య శారదాదేవి

కాళోజీ సెంటర్: స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లాలో తల్లిపాల వారోత్సవాలను ప్రారంభించారు. వరంగల్ నగరం, నర్సంపేట, వర్ధన్నపేటతోపాటు గ్రామాల్లో మొదటి రోజు పలు కార్యక్రమాలు నిర్వహించారు. వరంగల్ జక్కలొద్ది గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన తల్లిపాల వారోత్సవాల్లో కలెక్టర్ సత్య శారదాదేవి పాల్గొని మాట్లాడారు. నవజాత శిశువులకు తల్లిపాలే శ్రేష్ఠమని, ఆరు నెలల వరకు తల్లిపాలే పట్టించాలని సూచించారు. పుట్టిన గంటలోపే బిడ్డకు తల్లి ముర్రుపాలు పట్టించడం కీలకమని పేర్కొన్నారు. ఈ పాలు బిడ్డకు దివ్య ఔషధమని, లేకుంటే అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని చెప్పారు. ఈ నెల 7వరకు నిర్వహించే తల్లిపాల వారోత్సవాలను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలోని పిక్టోరల్ పెయింటింగ్స్‌ను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఈదురి అరుణ, జిల్లా సంక్షేమాధికారి హైమావతి, సీడీపీఓ విశ్వజ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. అదేవిధంగా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీడబ్ల్యూఓ జె.హైమావతి, డీఎంహెచ్‌ఎం వెంకటరమణ,ఆర్డీఓ కృష్ణవేణితో కలిసి కలెక్టర్ తల్లి పాల వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు.

సీఎం వ్యాఖ్యలను ఖండించాలి : బీఆర్‌ఎస్



నర్సంపేటలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న రవీందర్‌రెడ్డి, నాయకులు

నర్సంపేట: బీఆర్‌ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై చేసిన వ్యాఖ్యలను సీఎం రేవంత్‌రెడ్డి ఉపసంహరించుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు రాయిడి రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలో గురువారం బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణ అధ్యక్షతన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి తనస్థాయి మరిచి చేసిన వ్యాఖ్యలను ప్రతిఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు దేవోజు తిరుమల సదానందం, బాణాల ఇందిరారాంబాబు, పట్టణ ప్రధాన కార్యదర్శి వేనుముద్దల శ్రీధర్‌రెడ్డి, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజ్, కార్మిక విభాగం పట్టణ అధ్యక్షుడు కొల్లూరి లక్ష్మీనారాయణ, మండల శ్రీనివాస్, పెండ్యాల యాదగిరి, పైసా ప్రవీణ్, నాయిని వేణు, చుక్క అనిల్, గద్దె చంద్రమౌళి, పెండెం వెంకటేశ్వర్లు, తోట సుదర్శన్, ఆబోతు రాజు, కొమ్ముల కరుణాకర్, పెరుమాండ్ల రవి, మెడిద శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వర్ధన్నపేట: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డీఆర్‌డీఏ సెర్ప్ ప్రాజెక్టు మేనేజర్ భవాని అన్నారు. ఇల్లంద గ్రామంలోని పద్మశాలి భవన్‌లో గ్రామైక్య సంఘాల ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఏపీఎం వేణు, సుధాకర్, సీసీ గోలి కొమురయ్య, వీఓ అధ్యక్ష కార్యదర్శులు ఎండీ నజీమా, స్వప్న, జహీరాభాను, మోడెం సుమలత, కవిత,, హర్షవర్ధని, మాధవి, రాధిక, మమత, తక్కళ్లపల్లి శోభ, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

చెన్నారావుపేట: మండల కేంద్రం, పాపయ్యపేట, అమీనాబాద్ గ్రామాల్లో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు గురువారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ దయాకర్, హెచ్‌ఆర్ ఏపీఎం ధర్మేంద్ర మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మండల ప్రాజెక్టు మేనేజర్ ముక్కెర ఈశ్వర్, సీసీలు కట్టయ్య, సుజాత, మంజుల, భద్రయ్య పాల్గొన్నారు.

రుణమాఫీపై సందేహాలను నివృత్తి చేసుకోవాలి



సంగెం : రైతుతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి ఉషాదయాళ్

సంగెం: రుణమాఫీపై ఏమైనా సందేహాలుంటే రైతు వేదికల వద్ద ఉన్న ఏఈఓలను కలిసి నివృత్తి చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఉషాదయాళ్ రైతులకు సూచించారు. సంగెం, తిమ్మాపూర్, గాంధీనగర్, లోహిత, తీగరాజుపల్లి, గవిచర్ల గ్రామాల్లోని ఎరువులు, పురుగుల మందుల షాపులను గురువారం తనిఖీ చేశారు. అనంతరం పంట క్షేత్రాలను సందర్శించి పరిశీలించారు. మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో ఏఈఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రైతుబీమా కోసం నమోదు చేసుకోవాలన్నారు. వరి, పత్తి, మొక్కజొన్న పంటల్లో చేపట్టే సస్యరక్షణ చర్యల గురించి రైతులకు వివరించారు. జాతీయ ఆహారభద్రతా మిషన్ ఉమ్మడి జిల్లా కన్సల్టెంట్ సారంగం, టెక్నికల్ ఏఓ కృష్ణారెడ్డి, మండల వ్యవసాయాధికారి యాకయ్య, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

రైతుబీమాకు నమోదు చేసుకోవాలి

చెన్నారావుపేట: రైతుబీమాకు నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉషాదయాళ్ సూచించారు. లింగాపురం గ్రామంలో గురువారం పంటలను ఆమె పరిశీలించి మాట్లాడారు. ఈ సందర్భంగా వరి, పత్తి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతు రుణమాఫీపై సందేహాలు ఉంటే రైతు వేదికలకు పరిష్కరించుకోవాలన్నారు. పంటలకు ఆశిస్తున్న తెగుళ్లు, పురుగుల నివారణకు పలు సూచనలు చేశారు. పంటలను పరిశీలిస్తూ సెల్ఫీతో జేడీఏ సందడి చేశారు. కార్యక్రమంలో జాతీయ ఆహారభద్రతా మిషన్ ఉమ్మడి జిల్లా కన్సల్టెంట్ సారంగం, ఏఈఓ వినయ్, రైతులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల పనితీరు స్ఫూర్తిదాయకం

వర్ధన్నపేట: ఇల్లంద గ్రామంలోని మహిళా సంఘాల పనితీరు స్ఫూర్తి దాయకంగా ఉందని సెంట్రల్ అసిస్టెంట్ సెక్షన్ అధికారులు పేర్కొన్నారు. నాలుగో రోజు గురువారం మహిళా సంఘాల సభ్యులతో వారు భేటీ అయ్యారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. కేంద్ర బృందం ప్రతినిధులు నీరజ్‌కుమార్, శుభకర్, దీపక్, సునీల్ కుమార్, అమిత్ శర్మ ఉన్నారు. ఎంపీడీఓ వెంకటరమణ, ఎంపీఈఓ ధనలక్ష్మి, భవాని, ఏపీఎం వేణు, సుధాకర్, సీసీ గోలి కొమురయ్య, టీపీ రాజు, పంచాయతీ కార్యదర్శి రామారావు, వీఓ ప్రతినిధులు భాను, స్వప్న, నజీమా, హర్షవర్ధని, మోడెం కవిత, వీఓఎలు శోభ, రమయ్య, స్రవంతి, రమ తదితరులు పాల్గొన్నారు.

తీగరాజుపల్లిని సందర్శించిన కేంద్ర బృందం

సంగెం: మండలంలోని తీగరాజుపల్లి గ్రామాన్ని కేంద్ర బృందం ప్రతినిధులు గురువారం సందర్శించారు. న్యూఢిల్లీలోని సెంట్రల్ అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్స్ బృందం సభ్యులు మూడో రోజు సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనులను పరిశీలించారు. కేంద్రం బృందం సభ్యులు అహ్మద్, ఉమేశ్ పాల్, పంకజ్ యాదవ్, తుషార్ యాదవ్, ఆశిష్ కంబోజ్, ఏపీఎం కిషన్, అశోక్, పరమాత్మ, పంచాయతీ కార్యదర్శి మమత, నర్సింహస్వామి, మహబూబ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండ రైల్వేస్టేషన్‌లో సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ

నర్సంపేట/నెక్కొండ: నెక్కొండ రైల్వే స్టేషన్‌లో సమస్యలు పరిష్కరించాలని, పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలని ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం వారు ఢిల్లీలో కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినివైష్ణవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. 'అరకొర వసతులే'.. శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి స్పందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రైల్వే స్టేషన్‌లోని సమస్యలను పరిష్కరించాలని కేంద్ర మంత్రిని కలిసి, స్పెషల్ ఆఫీసర్‌ను నియమించాలని కోరామన్నారు. కేంద్ర మంత్రి స్పందించి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారని వారు తెలిపారు. వారి వెంట టీసీపీపీ సభ్యుడు సాంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు, పర్వతగిరి మాజీ జెడ్పీటీసీ సింగులాల్ ఉన్నారు.

అట్రాసిటి కేసులను పరిష్కరించాలి



విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారదాదేవి

కాళోజీ సెంటర్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసుల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని కలెక్టర్ సత్య శారదాదేవి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం జరిగిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పెండింగ్ ట్రయల్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో అట్రాసిటి అంశాలతో ముడిపడి ఉన్న సంఘటనలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తేవాలని చెప్పారు. ప్రతినెల గ్రామాల్లో నిర్వహించే సివిల్ రైట్స్ డే సమావేశానికి తహసీల్దార్లు, ఎస్‌హెచ్‌ఓలు, సంబంధిత శాఖల అధికారులు హాజరుకావాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లలో విద్యార్థులకు అందిస్తున్న మెనూ ప్రదర్శించాలని, చెన్నారావుపేట, నర్సంపేట, దుగ్గొండి మండలాల్లో గుడుంబా అరికట్టేందుకు అధికారుల శ్రద్ధ పెట్టాలని సూచించారు. జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి పెద్దిరెడ్డి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ 51 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. సమావేశంలో డీసీపీ రవీందర్, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, వ్యవసాయశాఖ అధికారి ఉషాదయాళ్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి సౌజన్య, జిల్లా సంక్షేమ శాఖ అధికారి హైమావతి, ఏసీపీలు కిరణ్, సురేశ్, ఎస్‌హెచ్‌ఓలు శివకుమార్, క్రాంతికుమార్, తిరుపతి, సూర్యప్రకాశ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆనంద్, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు చిన్న స్వామి, యాదగిరి, మహేందర్, విజయకుమార్, సాంబన్న పాల్గొన్నారు.

భూనిర్వాసితులకు పరిహారం చెల్లించాలి

ఇన్నర్ రింగ్ రోడ్డు భూనిర్వాసితులకు పరిహారం చెల్లింపును వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ అశ్విని తానాజీవాకడే, అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇన్నర్ రింగ్‌రోడ్డుకు భూములు ఇచ్చిన తిమ్మాపూర్, ఖిలావరంగల్, గొర్రెకుంట, ఏనుమాముల రైతులకు త్వరితగతిన పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. స్పోర్ట్స్ స్టేడియం, క్రీడా నగరం కోసం నగర పరిసరాల్లో 50 నుంచి 100ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించాలని ఆర్డీఓకు సూచించారు. సమావేశంలో ఆర్డీఓ కృష్ణవేణి, కుడా పీఓ అజిత్‌రెడ్డి, ఈఈ భీంరావు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, తహసీల్దార్లు ఎండీ ఇక్బాల్, నాగేశ్వర్‌రావు, రియాజుద్దీన్ పాల్గొన్నారు.

కమిషనరేట్‌లో పోలీస్ అధికారుల బదిలీ

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలువురు ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ సీపీ అంబర్ కిషోర్ ఝా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌స్పెక్టర్లలో ఎ.శ్రీనివాస్‌రెడ్డి వీఆర్ నుంచి రఘునాథపల్లికి, ఈ.శ్రీనివాస్ రఘునాథపల్లి నుంచి పీసీఆర్ కమిషనరేట్‌కు, ఎ.ప్రవీణ్‌కుమార్ ఎల్కతుర్తి నుంచి ధర్మసాగర్, ఎ.మహేందర్ ధర్మసాగర్ నుంచి సీసీఎస్ వరంగల్, జి.వేణు అటాచ్డ్ కమిషనరేట్ నుంచి స్టేషన్ ఘన్‌పూర్, ముష్కరాజు స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి మల్టీజోన్ ఐజీకి బదిలీ అయ్యారు.

సబ్‌ఇన్‌స్పెక్టర్లు..

బండి శ్రవణ్‌కుమార్ కొడకండ్ల నుంచి లింగాలఘణపురం, సీహెచ్.రాజు లింగాలఘణపురం నుంచి ఇంతేజార్‌గంజ్, బానోత్ రాంచరణ్ కేయూసీ నుంచి జఫర్‌గఢ్, ఎ.సురేశ్ వీఆర్ నుంచి వేలేరు, డి.హరిత వేలేరు నుంచి సుబేదారి, ఎస్.నవీన్‌కుమార్ వీఆర్ నుంచి చిల్పూరు, ఎం.రాజేందర్ చిల్పూరు నుంచి కేయూసీకి బదిలీ చేశారు.

సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం



వర్ధన్నపేట : సంబురాలు చేసుకుంటున్న ప్రజాసంఘాల నాయకులు

వర్ధన్నపేట: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమని జాతీయ యువజన అవార్డు గ్రహీత జక్కి శ్రీకాంత్ అన్నారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో గురువారం వర్ధన్నపేటలోని అంబేడ్కర్ విగ్రహానికి వివిధ ప్రజా సంఘాలు, పార్టీల నాయకులు పాలాభిషేకం చేశారు. పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్వీట్లు పంపిణీ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాలే ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం హర్షణీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కంజర్ల మహేశ్, దుబ్బ యాకయ్య, జనగాం చంద్రమౌళి, ఈరెల్లి శ్రీనివాస్, ఎర్ర శ్రీకాంత్, చింత బాబు, నందిపాక భాస్కర్, చింత ఆనందరాజు, బరిగెల బాబు, దుబ్బ ఎల్లయ్య, దుబ్బ అంజయ్య, బొక్కల భాస్కర్, డెక్క యాకయ్య, క్రాంతికుమార్, సీనపల్లి బాబు పాల్గొన్నారు.

తీర్పును స్వాగతిస్తున్నాం..

వరంగల్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అన్నారు. ఎస్సీ, ఎస్టీల వర్గీకరణపై తీర్పు వెలువరించిన రాజ్యాంగ ధర్మాసనానికి కృతజ్ఞతలు తెలిపారు. విద్య, ఉద్యోగ, ఇతర రంగాల్లో ఉపకులాలకు ప్రయోజనం చేకూరేలా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను వర్గీకరించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంటుందని అత్యున్నత న్యాయస్థానం తీర్పునిచ్చిందని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా ఏబీసీడీ వర్గీకరణ అమలుపై అన్ని రాష్ట్రాల కంటే ముందుగా తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.

మహిళా సాధికారతకు ప్రాధాన్యం

- అదనపు కలెక్టర్ సంధ్యారాణి

వర్ధన్నపేట: మహిళా సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. వర్ధన్నపేటలో గురువారం నిర్వహించిన మహిళ శక్తి అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. వ్యాపార వాణిజ్యరంగాలతో పాటు పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఇందిరా మహిళా శక్తి పథకానికి రాష్ట్ర ప్రభుత్వం రూపకల్పన చేసిందన్నారు. ఈ పథకం ద్వారా 63 లక్షల మంది మహిళలకు లబ్ధి చేకూరాలనేది ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందు కోసం ఆర్థిక సాయం చేస్తుందని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఆంగోత్ అరుణ, మున్సిపల్ కమిషనర్ ఇ.జోనా, మెప్మా డీఎంసీ రేణుక, ఏడీఎంసీ వహీదా, రిసోర్స్ పర్సన్లు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డీఈఈ సెట్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ షురూ

● తొలిరోజు 165 మంది అభ్యర్థులు హాజరు



అభ్యర్థుల సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేస్తున్న అధికారులు

విద్యారణ్యపురి: 2024–2026 విద్యాసంవత్సరానికి సంబంధించి రాష్ట్రంలోని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్)లలో ప్రవేశాల కోసం నిర్వహించిన డీఈఈ సెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ గురువారం హనుమకొండ ప్రభుత్వ డైట్ కళాశాలలో ప్రారంభమైంది. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి సుమారు 165 మంది అభ్యర్థులు హాజరై తమ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకున్నారు. ఈ ప్రక్రియ ఈనెల 6వ తేదీ వరకు కొనసాగనుంది. పీజీ హెచ్‌ఎంలు ఎం. పట్టాభి, రామకృష్ణారెడ్డి సిబ్బందితో కలిసి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేశారు.

రేపు ఎస్సార్‌లో గ్రాడ్యుయేషన్ డే



మాట్లాడుతున్న అర్చనారెడ్డి

హసన్‌పర్తి: నగర శివారులోని ఎస్సార్ యూనివర్సిటీలో శనివారం ద్వితీయ గ్రాడ్యుయేషన్ డే నిర్వహించనున్నారు. ఈ మేరకు గురువారం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రిజిస్ట్రార్ డాక్టర్ అర్చనారెడ్డి మాట్లాడారు. గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి సైయంట్ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ బి.వి.ఆర్ మోహన్ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు చెప్పారు. సినీనటుడు తనికెళ్ల భరణి పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ఎస్సార్ యూనివర్సిటీ చాన్స్‌లర్ ఎ. వరదారెడ్డి అధ్యక్షత వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని విద్యార్థులను సన్మానించనున్నట్లు వివరించారు. సమావేశంలో డాక్టర్ మహేశ్, డాక్టర్ రామ్‌దేశ్‌ముఖ్,డాక్టర్ సుమన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కేవీకేలో ఫోన్ ఇన్ ప్రోగ్రాం

మామునూరు: కృషి విజ్ఞాన కేంద్రం మామునూరు, వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ సౌమ్య, డాక్టర్ రాజు ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రధాన పంటల చీడ పీడలు, ఇతర యాజమాన్య పద్ధతులపై రైతుల సందేహాలు నివృత్తి చేసేందుకు ఫోన్‌ఇన్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల రైతులు 910095 6361 నంబర్‌కు కాల్ చేసి తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని ఆయన కోరారు.



ర్యాగింగ్‌కు పాల్పడుతున్న విద్యార్థులు (ఫైల్)

ఇతర దేశాల నుంచి సంక్రమించిన ర్యాగింగ్ భూతం నేడు ఎంతో మంది విద్యార్థులను బలి తీసుకుంటుంది. దీనిని కట్టడి చేసేందుకు ప్రభుత్వం పకడ్బందీగా చట్టాలు రూపొందించినా.. అక్కడక్కడ ఈ వికృత క్రీడ గుట్టుచప్పుడు కాకుండా సాగుతోంది. ఇటీవల జనగామ జిల్లాలోని ఓ గురుకుల పాఠశాలలో ర్యాగింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో సర్వత్రా చర్చనీయంశమైంది.

ర్యాగింగ్‌ను తరిమేద్దాం

చిన్న తప్పిదం.. భవిష్యత్ అంధకారం

● తోటి విద్యార్థులను వేధిస్తే జైలుకే..
● అన్ని కళాశాలల్లో ర్యాగింగ్ నిరోధక కమిటీలు

కాజీపేట: హనుమకొండ జిల్లాలో నిట్ కళాశాలతో పాటు రెండు యూనివర్సిటీ కాలేజీలు, 12 ఇంజనీరింగ్ కళాశాలలు, ప్రభుత్వ, ప్రైవేట్ ఫార్మసీ, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, జూనియర్ కళాశాలలు ఉన్నాయి. నూతన విద్యా సంవత్సరంలో చేరిన విద్యార్థులకు ఇప్పుడిప్పుడే తరగతులు ప్రారంభమవుతున్నాయి. ఎన్నో ఆశలు, ఆశయాలతో వీరు కళాశాలల్లో అడుగు పెడుతున్నారు. సరదా పేరుతో సాగే ర్యాగింగ్.. వికృత రూపం దాల్చి విద్యార్థుల భవిష్యత్‌ను బుగ్గిపాలు చేస్తోంది. ప్రస్తుతం నూతన విద్యార్థుల ప్రవేశాలు మొదలైన నేపథ్యంలో ఆయా సంస్థల యాజమాన్యాలతో పాటు పోలీసులు దృష్టిసారించాల్సి ఉంది.

జిల్లాలో ఇంజనీరింగ్, మెడికల్, డెంటల్, పీజీ, డిగ్రీ, కళాశాలల్లో ర్యాగింగ్ సంస్కృతి తక్కువే. అయితే తరుచూ ఎక్కడో ఒక చోట ఆ వికృత క్రీడ సాగుతూనే ఉంది. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల అభ్యర్థన, కొన్ని సందర్భాల్లో రాజీ వంటి కారణాలతో కేసులు నమోదు కావడంలేదు. అలాగే, విద్యార్థుల భవిష్యత్ నాశనమవుతుందన్న మానవతా దృక్పథంతో పోలీసులు సైతం కేసు నమోదు చేయడం లేదు.దీంతో సీనియర్లు, జూనియర్ల మధ్య గొడవలు అవుతునే ఉన్నాయి. కళాశాలల్లో ర్యాగింగ్ నిరోధక కమిటీలు ఏర్పాటుచేసి వాటిని మరింత బలోపేతం చేయాల్సి ఉంది.

నిరోధక కమిటీలు తప్పనిసరి..

ఇంటర్ అనంతరం ప్రతి కళాశాలలో ర్యాగింగ్ నిరోధక కమిటీలు ఏర్పాటు చేయాలని నిబంధనలున్నాయి. ఆయా కమిటీలో కళాశాలల డైరెక్టర్లు, అధ్యాపకులు, సీనియర్, జూనియర్ విద్యార్థులు ఉంటారు. ప్రతినెలా కమిటీ సమావేశాన్ని నిర్వహించాలి. కళాశాలలో ఎప్పుడైనా ర్యాగింగ్ జరుగుతుందా.. జూనియర్ విద్యార్థులను వేధింపులకు గురిచేస్తున్నారా అనే విషయాలను కమిటీ ఎప్పటికప్పుడు గమనించాలి. ర్యాగింగ్ జరుగుతున్నా పట్టించుకోకుండా, పోలీసులకు సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తే ఆయా కళాశాలల యాజమాన్యాలపై కూడా పోలీసులు కేసు నమోదు చేస్తారు. ప్రతి కళాశాల ప్రాంగణంలో సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటుచేయాలని పోలీసులు సూచిస్తున్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు..

ర్యాగింగ్‌కు పాల్పడే విద్యార్థులపై కఠిన చర్యలు తీసుకునే అవకాశముంది. తరగతుల నుంచి బహిష్కరణ, ఉపకార వేతనాల నిలుపుదల, క్యాంపస్ ప్లేస్‌మెంట్‌కు అనర్హుడిగా ప్రకటించొచ్చు. ఒకటి నుంచి మూడేళ్ల వరకు కళాశాల బహిష్కరణ, జరిమానా విధించొచ్చు.పోలీసులు కేసులు నమోదు చేయొచ్చు.



జీవితఖైదుతో పాటు శిక్ష..

ర్యాగింగ్ చట్టరీత్యానేరం.. ర్యాగింగ్‌కు పాల్పడినా, సహకరించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటారు. నేర తీవ్రతను బట్టి జీవిత ఖైదు కూడా పడే అవకాశాలు ఉన్నాయి. ర్యాగింగ్ నిరోధక చట్టం–1997 ప్రకారం నేరం రుజువైతే శిక్షలు అమలు చేస్తారు.

ఇలా చేయరాదు..

శారీరకంగా, మానసికంగా విద్యార్థిని ఇబ్బంది పెడితే ర్యాగింగ్‌గానే భావించొచ్చు. ప్రాక్టికల్ జోక్స్ కూడా ర్యాగింగ్‌గానే పేర్కొనవచ్చు. క్యాంపస్‌లోనే కాదు, కాంపౌండ్ బయట, బస్సుల్లో, బహిరంగంగా, నాలుగు గోడల మధ్య క్రిమినల్ ఫోర్స్ మాటల ద్వారా గాయపర్చినా, ఇబ్బందికరమైన ఈ–మెయిల్ పంపినా ర్యాగింగ్‌గానే పరిగణించొచ్చు.

చైతన్య సదస్సులు నిర్వహిస్తున్నాం..



ర్యాగింగ్‌కు పాల్పడడం చట్టరీత్యానేరం. ర్యాగింగ్ నిర్మూలనకు ఉన్నతాధికారుల ఆదేశం మేరకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ఇప్పటికే కళాశాలలు పునః ప్రారంభమైన దృష్ట్యా ఆయా యాజమాన్యాలతో చర్చిస్తున్నాం. యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటు చేసి, అవి ఉత్సాహంగా పనిచేసేలా చర్యలు తీసుకుంటాం. కళాశాలలకు నూతన విద్యార్థులు పూర్తిస్థాయిలో వచ్చాక అక్కడ కూడా సదస్సులు నిర్వహిస్తాం. ర్యాగింగ్‌కు పాల్పడితే జరిగే అనర్థాలను విద్యార్థులకు వివరిస్తాం.

– వై.సుధాకర్ రెడ్డి, సీఐ, కాజీపేట

ఉపేక్షించడం మంచిది కాదు



కళాశాలల్లో ర్యాగింగ్ సంస్కృతిని తరిమేందుకు సీనియర్లతో కలిసి నూతన విద్యార్థులకు స్వాగతం పలికిస్తూ సదస్సులు నిర్వహిస్తున్నాం. విద్యార్థుల్లో ఎటువంటి భయం లేకుండా ధైర్యం కల్పిస్తున్నాం. ర్యాగింగ్‌కు పాల్పడే వారిని ఉపేక్షించడం మంచిది కాదు.

– తాళ్ల మల్లేశం, తాళ్ల పద్మావతి విద్యాసంస్థల చైర్మన్

పలు రైళ్ల రద్దు.. దారి మళ్లింపు

● కాజీపేట జంక్షన్‌లో హాల్టింగ్ ఎత్తివేత
● మూడో రైల్వే లైన నిర్మాణ పనులతో ఈ నిర్ణయం



కాజీపేట రూరల్: కాజీపేట– విజయవాడ రూట్‌లో జరుగుతున్న మూడో రైల్వే లైన్ నిర్మాణ పనులతో కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్ల మీదుగా ప్రయాణించే పలు రైళ్ల రద్దుతో పాటు కాజీపేట కాకుండా వయా విజయవాడ మీదుగా దారి మళ్లించి నడిపిస్తున్నట్లు కాజీపేట రైల్వే అధికారులు గురువారం తెలిపారు.

రద్దయిన రైళ్లు..

ఆగస్టు 5వ నుంచి 10వ తేదీ వరకు విజయవాడ–సికింద్రాబాద్(12713) శాతవాహన ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–విజయవాడ (12714) శాతవాహన ఎక్స్‌ప్రెస్, గుంటూరు–సికింద్రాబాద్(17201) గోల్కొండ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–గుంటూరు(17202) గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు.

దారి మళ్లించిన రైళ్లు..

ఆగస్టు 2వ నుంచి 10వ తేదీ వరకు వయా కాజీపేట మీదుగా కాకుండా పగిడిపల్లి, గుంటూరు మీదుగా హైదరాబాద్ –తాంబరం (12760) ఎక్స్‌ప్రెస్, తాంబరం–హైదరాబాద్ (12759) ఎక్స్‌ప్రెస్, ఆగస్టు 2,4,5,6,8,9వ తేదీల్లో సికింద్రాబాద్–తిరుపతి (12764) పద్మావతి ఎక్స్‌ప్రెస్, ఆగస్టు 2 నుంచి 10వ తేదీ వరకు సికింద్రాబాద్–గూడూరు (12710) సింహపురి ఎక్స్‌ప్రెస్, ఆదిలాబాద్–తిరుపతి (17406) కృష్ణా ఎక్స్‌ప్రెస్, తాంబరం–హైదరాబాద్ (12759) ఎక్స్‌ప్రెస్, ఆగస్టు 3,5,6,7,9,10వ తేదీల్లో తిరుపతి–సికింద్రాబాద్ (12763) పద్మావతి ఎక్స్‌ప్రెస్, ఆగస్టు 3 నుంచి 9వ తేదీ వరకు గూడూరు–సికింద్రాబాద్ (12709) సింహపురి ఎక్స్‌ప్రెస్, ఆగస్టు 3 నుంచి 9వ తేదీ వరకు తిరుపతి–ఆదిలాబాద్ (17405) కృష్ణా ఎక్స్‌ప్రెస్‌కు వరంగల్, కాజీపేట జంక్షన్‌లో తాత్కాలికంగా హాల్టింగ్ ఎత్తివేసి వయా విజయవాడ, నడికుడ, నల్లగొండ మీదుగా దారి మళ్లించి నడిపిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

వయా విజయవాడ మీదుగా..

ఆగస్టు 2 నుంచి10వ తేదీ వరకు ముంబాయి–భువనేశ్వర్ (11019) కోణార్క్ ఎక్స్‌ప్రెస్, ఆగస్టు 3 నుంచి 11 వతేదీ వరకు హైదరాబాద్–షాలిమార్ (18045) షాలిమార్ ఎక్స్‌ప్రెస్, ఆగస్టు 4,6,8వ తేదీల్లో షిర్డీ–కాకినాడ పోర్ట్ (17205) షిర్డీ ఎక్స్‌ప్రెస్, ఆగస్టు 2 నుంచి 9వ తేదీ వరకు షిర్డీ–విశాఖపట్నం (18504) ఎక్స్‌ప్రెస్, ఆగస్టు 3 నుంచి 11 వ తేదీ వరకు హైదరాబాద్–విశాఖపట్నం (12728) గోదావరి ఎక్స్‌ప్రెస్, ఆగస్టు 2 నుంచి 10వ తేదీ వరకు విశాఖపట్నం–ఎల్‌టీటీ ముంబాయి (18519) ఎక్స్‌ప్రెస్, ఆగస్టు 6వ తేదీన మచిలీపట్నం–షిర్డీ(17202) ఎక్స్‌ప్రెస్, ఆగస్టు 3,5,6,78,10వ తేదీల్లో నర్సాపూర్–నాగర్‌సోల్ (12787) ఎక్స్‌ప్రెస్, ఆగస్టు 3 నుంచి 11వ తేదీ వరకు మచిలీపట్నం–బీదర్ (12749) ఎక్స్‌ప్రెస్, ఆగస్టు 2 నుంచి 10వ తేదీ వరకు ఎల్‌టీటీ ముంబాయి–విశాఖపట్నం (18520) ఎక్స్‌ప్రెస్, ఆగస్టు 7వ తేదీన షిర్డీ–మచిలీపట్నం (17207) ఎక్స్‌ప్రెస్, ఆగస్టు 2,4,6,7,8,9వ తేదీల్లో నాగర్‌సోల్–నర్సాపూర్ (12788) ఎక్స్‌ప్రెస్, ఆగస్టు 2 నుంచి 10వ తేదీ వరకు బీదర్–మచిలీపట్నం (12750) ఎక్స్‌ప్రెస్‌ను వయా కాజీపేట కాకుండా వయా విజయవాడ మీదుగా దారి మళ్లించి నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

వరంగల్ ఆర్‌జేడీఎంగా ఉప్పల శ్రీనివాస్

● డీడీఎంగా పద్మావతి
● ఉత్తర్వులు జారీ చేసిన మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి



ఉప్పల శ్రీనివాస్



పద్మావతి

వరంగల్: వరంగల్ రీజియన్ మార్కెటింగ్ శాఖ పరిధిలో నాలుగేళ్లకు పైగా ఒకే చోట విధులు నిర్వర్తించిన ఉన్నతాధికారులు బదిలీ అయ్యారు. వరంగల్ ఆర్‌జేడీఎం ఈ.మల్లేశం హైదరాబాద్ రీజియన్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో డైరెక్టర్ కార్యాలయంలో అదనపు డైరెక్టర్‌గా విధులు నిర్వరిస్తున్న ఉప్పుల శ్రీనివాస్ నియమితులయ్యారు. శ్రీనివాస్ వరంగల్ జిల్లాకు సుపరిచితుడే. శ్రీనివాస్‌కు వరంగల్‌లో జేడీఎం, డీడీఎం, ఏడీ, వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శిగా పనిచేసిన అనుభవం ఉంది. అదే విధంగా వరంగల్ డీడీఎం అజ్మీరా రాజునాయక్ హైదరాబాద్ హెడ్‌ఆఫీస్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో కరీంనగర్ మార్కెట్ కమిటీ సెక్రటరీగా, ఇన్‌చార్జ్ డీఎంఓగా విధులు నిర్వర్తిస్తున్న పద్మావతి నియమితులయ్యారు. అదే విధంగా జమ్మికుంట మార్కెట్ కమిటీ కార్యదర్శి గుగులోత్ రెడ్డి నర్సంపేట మార్కెట్ సెక్రటరీగా నియమితులయ్యారు. నర్సంపేటలో కార్యదర్శి, ఇన్‌చార్జ్ డీఎంఓగా విధులు నిర్వర్తిస్తున్న ప్రసాదరావు హైదరాబాద్ రీజియన్ డీడీఎంగా బదిలీ అయ్యారు. అదే విధంగా హుజూర్‌నగర్ మార్కెట్ కార్యదర్శి ఆర్.మల్లేశం జమ్మికుంట కార్యదర్శిగా నియమితులయ్యారు. గతంలో ఇక్కడ పనిచేసి బదిలీపై సూర్యాపేటకు వెళ్లిన వెంకటరాహుల్‌ను కోదాడ మార్కెట్ సెక్రటరీగా నియమిస్తూ మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు బదిలీ అయిన అధికారులందరూ గురువారం బాధ్యతలు చేపట్టినట్లు సమాచారం.

టాస్క్ పూర్తిచేస్తే డబ్బులు..

● ఆశ చూపిన సైబర్ నేరగాళ్లు
● నమ్మి రూ.3.75 లక్షలు పోగొట్టుకున్న మహిళ
● మహబూబాబాద్‌లో ఘటన

మహబూబాబాద్ రూరల్ : టాస్క్ పూర్తిచేస్తే డబ్బులు వస్తాయనే మెసేజ్‌ను నమ్మిన ఓ మహిళ.. సైబర్ వలలో చిక్కుకుని రూ.3.75 లక్షలు పోగొట్టుకుంది. ఈ ఘటన గురువారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా కేంద్రానికి చెందిన ఓ మహిళకు గత నెల (జూలై) 29వ తేదీన వాట్సాప్ ద్వారా ఓ లింక్ వచ్చింది. అందులో ఈ టాస్క్ పూర్తిచేస్తే డబ్బులు వస్తాయని అవతలి వ్యక్తులు చెప్పారు. దీంతో ఇది నిజమని నమ్మిన సదరు మహిళ.. ఆ లింక్‌లో ఉన్న వీడియోలను ఫొటోలు తీసి అవతలి వ్యక్తులు చెప్పిన టాస్క్ పూర్తిచేసింది. ఆ వెంటనే ఆమెకు అదే రోజు ఒక సారి రూ.300, రెండోసారి రూ.1,300, మూడో సారి రూ.4800 వచ్చాయి. ఆ కొంత సమయం తరువాత మరో టాస్క్ చేస్తే మరిన్ని డబ్బులు వస్తాయని, పెట్టుబడిపెడితే మరిన్ని లాభాలు గడించొచ్చని టెలిగ్రాం ద్వారా మరో మెసేజ్ వచ్చింది. దీంతో ఆ మెసేజ్ కూడా నమ్మిన సదరు మహిళ.. గత నెల 30వ తేదీ, 31వ తేదీ రెండు రోజుల్లో కలిపి మొత్తం రూ.3.75 లక్షలు పెట్టుబడిపెట్టింది. ఆ డబ్బులకు సంబంధించిన ఎలాంటి సమాచారం రాకపోవడంతో తాను సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయానని గుర్తించింది. వెంటనే 1930కి కాల్ చేసి చెప్పింది. అదే విధంగా మహబూబాబాద్ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఐ పెండ్యాల దేవేందర్ కేసు నమోదు చేశారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి బలవన్మరణం

వేర్వేరు కారణాలతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ముగ్గురు బలవన్మరణాలకు పాల్పడ్డారు. ఇందులో అప్పుల బాధతో జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కుసుంబాయితండాలో కూలీ, వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం నారక్కపేటలో బోరుబండి ఆపరేటర్, హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం భీమారంలో తల్లి మందలించిందని యువతి ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీంతో ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.



ఉమల్ (ఫైల్)

రఘునాథపల్లి: అప్పుల బాధతో ఓ కూలీ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కుసుంబాయితండాలో బుధవారం రాత్రి జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కొర్ర ఉమల్ (36)కు ఎకరం భూమి ఉంది. వ్యవసాయంతో పాటు భార్య బంగారితో కలిసి కూలీ పనులకు వెళ్లేవారు. కొన్నేళ్లుగా వ్యవసాయం కలిసి రాకపోవడంతో అప్పులు చేశాడు. ఏటా అప్పులు పెరిగి రూ 8 లక్షలకు చేరాయి. దీంతో మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో గత నెల 30న తండావాసులతో కలిసి గ్రామ శివారులో దాటోడు పండుగకు వెళ్లాడు. అక్కడ అప్పులు ఇచ్చిన వారు ఒత్తిడి చేయడంతో జీవితంపై విరక్తి చెందిన ఉమల్.. ఇంటికెళ్లి పురుగుల మందు తాగాడు. పక్కింటి వారు గుర్తించి కుటుంబీకులకు సమాచారమివ్వగా వెంటనే వారు చేరుకుని అపస్మారక స్థితిలో ఉన్న ఉమల్‌ను జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు వరంగల్ ఎంజీఎం తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం (గత నెల 31న) రాత్రి మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు హుస్సేన్, చరణ్ ఉన్నారు. మృతుడి భార్య బంగారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

నారక్కపేటలో బోరుబండి ఆపరేటర్ ..

నల్లబెల్లి: అప్పుల బాధతో బోరుబండి ఆపరేటర్ ఓదెల సదయ్య (45) ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నారక్కపేట గ్రామానికి చెందిన సదయ్య బోరుబండి ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఇంటివద్ద తనకున్న ఎకరం భూమిలో సదయ్య భార్య వ్యవసాయం చేస్తుండగా చేదోడు వాదోడుగా ఉండేవాడు. ఈ క్రమంలో ఇంటి అవసరాలు, పంట సాగుకు అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం కనిపించలేక మానసిక వేదనకు గురైన సదయ్య గురువారం సాయంత్రం ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య వినోద, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

తల్లి మందలించినందుకు భీమారంలో యువతి..



స్రవంతి మృతదేహం

హసన్‌పర్తి: తల్లి మందలించిందనే కారణంతో మనస్తాపం చెందిన కూతురు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన గురువారం కేయూ పీఎస్ పరిధిలోని భీమారంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం కందిగడ్డ తండాకు చెందిన సరోజన, బాబు దంపతులతో పాటు కూతురు స్రవంతి (19) కొంతకాలం క్రితం బతుకుదెరువు నిమిత్తం భీమారం వచ్చారు. ఇక్కడ కూలీ చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈక్రమంలో ఇటీవల ఇంటి ఖర్చుల నిమిత్తం తల్లి సరోజన.. స్రవంతికి రూ.వెయ్యి ఇచ్చింది. అయితే ఈ డబ్బును స్రవంతి ఇతర అవసరాలకు వినియోగించింది. ఈవిషయమై తల్లి మందలించడంతో మనస్తాపానికి గురైన స్రవంతి.. ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం తరలించారు. ఈ ఘటనపై మృతురాలి తండ్రి బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

ఆకతాయిల అలజడి..

మిల్స్‌కాలనీ పీఎస్ పరిధిలో పేట్రేగుతున్న అల్లరి మూకలు

● పగలు, రాత్రి తేడా లేకుండా మద్యం, గంజాయి సేవనం
● రోడ్లపై తిష్ట.. స్థానికులపై దాడులు
● మరింత గస్తీ పెంచాలని పోలీసులకు ప్రజల విజ్ఞప్తి



ఖిలా వరంగల్ : వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆకతాయిలు, మందుబాబులు అలజడి సృష్టిస్తున్నారు. మత్తులో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ రోజురోజుకూ పేట్రేగిపోతున్నారు. సండే వచ్చిందంటే చాలు.. వారి వీరంగానికి హద్దే ఉండడం లేదు. పట్టపగలే నిర్జీవ ప్రదేశాలు, ఖాళీ స్థలాలు, వదిలేసిన ఇళ్లు, మట్టి కోట, ముళ్ల పొదల మాటున గుంపులుగా చేరి మద్యం, గంజాయి, ఇతర డ్రగ్స్ పీల్చుతున్నారు. మత్తులో అటువైపు రాకపోకలు సాగించే వారితో గొడవలకు దిగుతున్నారు. పొరపాటున ఎవరైనా ప్రశ్నిస్తే ఇక అంతే.. కత్తులు, బ్లేడ్‌లు చూపుతూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. దీంతో తమ కేందుకు అనే భావనతో ఎవరికి వారు ఉండిపోతున్నారు. దీంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.



రోడ్ల మీద బైకులపై చక్కర్లు..

నగరంలోని బట్టల దుకాణాల్లో పనిచేసే యువతులు వందల సంఖ్యలో ఉన్నారు. వీరు అంతర్గత రహదారులపై నడుచుకుంటూ ఇంటికి వెళ్తారు. ఈ క్రమంలో సాయంత్రం నుంచి మొదలు.. రాత్రి తొమ్మిది గంటల వరకు ఆకతాయిలు బైకులపై వేగంగా సంచరిస్తూ ప్రధాన రహదారుల్లో కొంత మంది బాలికలు, యువతులను వేధించే ధోరణిలో దూకుడు పెంచుతున్నారు. దీంతో చెల్లి కాస్త జాగ్రత్త.. కళాశాలకు వచ్చి వెళ్లేటప్పుడు అప్రత్తంగా ఉండాలని.. అనుమానం వస్తే డయల్ 100 చేయాలని సోదరులు, తల్లిదండ్రులు, పోలీసులు పదే పదే చెబుతున్నారు.

నిర్జీవ ప్రదేశాలే అడ్డా..

మద్యం, గంజాయి సులువుగా మత్తు ఎక్కే పదార్థాలు. ఎక్కువ మంది యువకులు ఈ పదార్థాలకు బానిసై జీవితాలను ఛిన్నాభిన్నం చేసుకుంటున్నారు. పోలీసులు ఎన్నిసార్లు కౌన్సెలింగ్ ఇచ్చినా.. కేసులు నమోదు చేసినా వారి తీరులో మార్పు రావడం లేదు. ప్రధానంగా దూపకుంట రోడ్డులో నిర్మాణ దశలోని డబుల్ బెడ్రూం ఇళ్లు, మట్టికోట పరిసరాలు, శంభునిపేట, బుడిగ జంగాల కాలనీ, గిరిప్రసాద్‌నగర్, గవిచర్ల క్రాస్, రంగశాయిపేట, నాగమయ్య కాలనీ, ఉర్సు కరీమాబాద్, ఎస్‌ఆర్‌ఆర్‌తోట, శాంతినగర్, కాశికుంట, శాకరాసికుంట, శివనగర్ ఏసీరెడ్డినగర్, చింతల్ చంద్రవదన, శివనగర్ స్టేషన్ రోడ్డుతోపాటు పలు కాలనీల్లోని పాత ఇళ్లను అడ్డాగా మార్చుకుని మద్యం,గంజాయి సేవిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన మందుబాబులు ఈ ప్రాంతాలను ఎంచుకుంటున్నట్లు తెలుస్తోంది. పీకలదాకా సేవించి రచ్చ చేస్తూ వారిలో వారే గొడవ పడుతూ రోడ్డుపై వచ్చేస్తున్నారు. దీంతో మహిళలు సాయంత్రం ఇంటి నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు.

అంతర్గత వీధులపై నిఘా



పోలీసు స్టేషన్ పరిధిలో గతం కంటే నేరాలు పూర్తిగా తగ్గుముఖం పట్టాయి. ఆడపిల్లలను వేధించడం, అఘాయిత్యాలకు యత్నించడం నేరం. ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. డిగ్రీ కళాశాలలు, జూనియర్ కళాశాల వద్ద నిఘా పెట్టాం. అనుమానిత యువకులను గుర్తించి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం. ఎక్కడైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలు గమనిస్తే డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

మల్లయ్య, ఇన్‌స్పెక్టర్ మిల్స్‌కాలనీ, వరంగల్

దీనిపై పోలీసులు స్పందించి అంతర్గత వీధుల్లో గస్తీ మరింత పెంచితే ఆకతాయిల ఆగడాలు తగ్గుముఖం పడుతాయని పలు కాలనీల ప్రజలు కోరుతున్నారు.

మచ్చుకు కొన్ని ఘటనలు..

యువకులు సాయంత్రం కాగానే క్రికెట్ అంటూ క్రీడామైదానాలకు చేరుకుంటున్నారు. అక్కడికే మద్యం, ఇతర మత్తు పదార్థాలు తెచ్చుకుని సేవించి అక్కడే ఎక్కువ సమయం గడుపుతున్నారు. దీంతో చీకటి పడితే అటు వైపు వెళ్లేందుకు స్థానికులు భయపడుతున్నారు. దీనిపై పోలీసులు స్పందించారు. ఇటీవల ఖిలా వరంగల్ వాకింగ్ గ్రౌండ్, ఇతర క్రీడామైదానాలపై దృష్టి సారించారు. క్రీడాకారులు, ఇతర యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇటీవల కాశికుంటలో గంజాయి మత్తులో మైనర్లు రహదార్లపై హల్‌చల్ చేశారు. రహదారులపై వెళ్తున్న వారిని దుర్భాషలాడుతూ బెదిరింపులకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు సీసీ పుటేజీ ద్వారా గుర్తించి అదుపులో తీసుకుని తల్లిదండ్రుల ఎదుట కౌన్సెలింగ్ ఇచ్చి వదిలేశారు.

బైక్ చోరీ కేసులో యువకుడి అరెస్ట్

తొర్రూరు రూరల్: బైక్ చోరీ కేసులో ఓ యువకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై జగదీష్ తెలిపారు. ఈ మేరకు తొర్రూరు పీఎస్‌లో యువకుడి అరెస్ట్ చూపి వివరాలు వెల్లడించారు. మండలంలోని అమ్మాపురం గ్రామానికి చెందిన బట్ట మేకల కృష్ణ తొర్రూరులో అద్దెకు ఉంటున్నాడు. ఈ క్రమంలో గత నెల 17వ తేదీన తన బైక్‌ను ఇంటి ఎదుట పార్క్ చేసి నిద్రిస్తున్నాడు. కొడకండ్ల మండలంలోని రేగుల గ్రామానికి చెందిన పేకట్నోజు సాయికృష్ణ డమ్మీ తాళంతో అర్ధరాత్రి సమయంలో బైక్‌ను ఎత్తుకెళ్లాడు. ఈఘటనపై బాధితుడు బట్టమేకల కృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. ఈ క్రమంలో గురువారం డివిజన్ కేంద్రంలోని పాలకేంద్రం సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా బైక్‌పై అనుమానాస్పదంగా వస్తున్న సాయికృష్ణ ఆపి విచారించగా నేరం ఒప్పుకున్నాడు. దీంతో అరెస్ట్ చేసి బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

ఏకలవ్య విద్యాలయ అభివృద్ధికి సహకరిస్తా

● జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్



మాట్లాడుతున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్

కురవి: మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల అభివృద్ధికి సహకరిస్తానని, చదువుతోనే భవిష్యత్ ఉంటుందని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ అన్నారు. ఈమేరకు గురువారం మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నెలకొన్న పలు సమస్యలను విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో హుస్సేన్ నాయక్ మాట్లాడారు. తాను మానుకోట బిడ్డనేనని, తనకు విద్యార్థుల కష్టాలు తెలుసన్నారు. తాను హాస్టల్‌లోనే చదువుకున్నానన్నారు. గిరిజన బిడ్డలు పోటీ పడి చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ప్రధాని మోదీ.. తనను గుర్తించి ఎస్టీ కమిషన్ సభ్యుడి పదవి ఇచ్చారని, దేశం మొత్తం తిరిగి సమస్యలు తెలుసుకోవాలని చెప్పారని వివరించారు. ఇక్కడ నెలకొన్న సమస్యలను రాష్ట్రపతికి వివరిస్తానన్నారు. కార్యక్రమంలో జాతీయ ఎస్టీ కమిషన్ డైరెక్టర్ మిరిండా, ఆర్‌డీఓ అలివేలు, ఆర్‌సీఓ హరిసింగ్, డీడీ ఎర్రయ్య, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ జ్యోతి, తహసీల్దార్ సునీల్‌రెడ్డి, ఎంపీడీఓ వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.